నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 16 జూలై 2024 | SANGAREDDY



చికిత్స కోసం క్యూలో నిల్చున్న రోగులు

## పాండురంగ ఆశ్రమంలో శతరుద్రాభిషేకం



పాండురంగస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

మర్కూక్, జూలై 15: ప్రసిద్ధ దైవక్షేత్రం మర్కూక్ పాండురంగస్వామి ఆలయంలో ఆశాఢ మహోత్సవాల్లో భాగంగా సోమవారం భవానీసమేత రామలింగేశ్వర స్వామికి వేదపండితులు మంత్రోచ్ఛనాల మధ్య శతరుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ నల్లకుంట ప్రాంతానికి చెందిన భక్తులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు హరే రామ..హరేకృష్ణ నామాలను స్మరించారు. గోవింద నామ స్మరణలు, పాండురంగడి భజనలు, కీర్తనలతో దైవక్షేత్రం భక్తపారవశ్యంతో పరిఢవిల్లింది.

# దవాఖానల్లో.. మందుల్లేవ్..





రామాయంపేట సీహెచ్‌సీలో రోజుకు రెండువందల ఔట్ పేషంట్లు

- విషజ్వరాలతో కిక్కిరిసిన దవాఖాన
- పేషంట్లకు మందులు సరిగ్గా ఇవ్వలేని ప్రభుత్వం
- ఏడు నెలలుగా అవస్థలతో ప్రభుత్వ దవాఖానలు
- ఏమీ చేయలేక, బయట చెప్పకోలేక చేతులెత్తేస్తున్న వైద్య సిబ్బంది




రామాయంపేట సీహెచ్‌సీ దవాఖాన



విషజ్వరాలతో నిండిన రామాయంపేట దవాఖాన

రామాయంపేట, జూలై 15: ఒకప్పుడు వైద్యులు అందుబాటులో లేక దవాఖానల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పల్లెలోనూ, మండల కేంద్రాల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వ దవాఖానల్లో సకల సదుపాయాలు కల్పించి, సరిపడా వైద్యులను, సిబ్బందిని నియమించడంతోపాటు అన్ని రోగాలకూ మందులను అందుబాటులో ఉంచింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దవాఖానల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో డాక్టర్లున్నా, మందులు లేకపోవడంతో ప్రజలకు వైద్యం అందకుండా పోతున్నది. మెదక్ జిల్లా రామాయంపేటలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నది. అక్కడ కనీస సదుపాయాలు లేకపోవడంతోపాటు మందులు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతున్నది. ఈ దవాఖానకు రోజూ 200 మంది ఔట్ పేషంట్లు వస్తుంటారు. రామాయంపేట, నిజాంపేట రెండు మండలాలకు ఒకే దవాఖాన ఉండడంతో ప్రజలు పెద్దసంఖ్యలో రామాయంపేటకు చేరుకుంటారు. దవాఖానలో బెడ్ల నిండా రోగులు ఉన్నా, మందులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో దవాఖానకు రోగులు క్యూకడుతున్నారు. వారికి గ్లూకోజ్ ఎక్కించడంతోపాటు జ్వరం తగ్గడం కోసం మాత్రలు ఇచ్చి సరిపెడుతున్నారు. ప్రభుత్వం సరిగ్గా మందులు సరఫరా చేయక పోవడంతో వైద్యులు అటు రోగులకు చెప్పుకో లేక ఇటు నాయకులను అడగక లేక మదనపడుతున్నారు. గత డిసెంబర్ నుంచి దాదాపు ఏడు నెలలుగా ప్రభుత్వం దవాఖానలకు మాత్రలు, ఇంజక్షన్లను ప్రభుత్వం సరైన సమయం లో సరఫరా చేయలేకపోతున్నది. పరిస్థితి ఇలాగే ఉంటే రోగులే దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టే అవకాశం లేకపోలేదు.

### పీహెచ్‌సీల్లో అంతంత మాత్రమే వైద్యసేవలు

గజ్వేల్, జూలై 15: గ్రామీణ ప్రాంతవాసులకు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. చుట్టుపక్కల గ్రామాలను కలుపుకొని గతంలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ కేంద్రాల్లో గ్రామీణ ప్రాంత రోగులకు అంతంత మాత్రంగా వైద్య సేవలు అందుతున్నాయి. గజ్వేల్ డివిజన్ పరిధిలో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గజ్వేల్‌లో జిల్లా దవాఖాన, మాతాశిశు, బస్తీ దవాఖాలున్నాయి. అందులో వర్గల్, ములుగు, మర్కూక్, సింగన్నగూడ, తిగుల్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి, కొండపాక, అహ్మదీపూర్, రాయపోల్, ఇందుప్రియాల్‌లో పీహెచ్‌సీ కేంద్రాలుండగా వీటిలో ప్రధానంగా ఆయా గ్రామాలకు చెందిన రోగులే రోజూ సాధారణ చికిత్సల కోసం వస్తుంటారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ఎక్కువగా వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు, కీళ్లనొప్పులు వంటి చిన్నపాటి అనారోగ్య సమస్యలతో వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓపీ సేవలను అధికంగా నిరుపేదలే వినియోగించుకుంటున్నారు. అయినా రోజూ వచ్చే రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న వాటినే ఇస్తూ కాలం వెల్లదీస్తున్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం పీహెచ్‌సీ కేంద్రాల్లో మందుల కొరత కారణంగా రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా వైరల్ ఫీవర్ అధికంగా వస్తుండడంతో ప్రభుత్వం వాటిని కట్టడి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గ్రామీణ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు వసతులు నామమాత్రంగానే ఉన్నాయి. గజ్వేల్ జిల్లా దవాఖానకు వచ్చే రోగులకు చికిత్స అనంతరం సరిపడా మందులు ఇవ్వకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు రాసిన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ దుకాణాల్లో తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి సమస్య ప్రతి రోజూ చాలామందికి ఎదురవుతున్నది. మందుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని రోగి తరఫున బంధువులు వాపోతున్నారు.



అహ్మదీపూర్ పీహెచ్‌సీ కేంద్రం

# వణికిస్తున్న విషజ్వరాలు

## కిటకిటలాడుతున్న సర్కారు దవాఖానలు

- దవాఖానల్లో సూదులు, మందుల కొరత
- రామాయంపేటలో రోగుల తాకిడి..
- పారిశుధ్య చర్యలు శూన్యం



మెదక్ జిల్లా కేంద్ర దవాఖానలో జ్వరపీడితులు

మెదక్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. కలుషిత నీరు, ఆహారం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. జ్వర బాధితులతో సర్కారు దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. మెదక్ జిల్లాలోని జిల్లా కేంద్ర దవాఖానతోపాటు నర్సాపూర్ ఏరియా దవాఖాన, తూప్రాన్, రామాయంపేట, కౌడిపల్లి పీహెచ్‌సీల్లో రోగులు బారులుతీరుతున్నారు. జిల్లాలోని దవాఖానల్లో మందులు, సూదుల కొరతతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది.

### సిబ్బందితోనే చికిత్సలు..

మెదక్ జిల్లాలోని కౌడిపల్లి పీహెచ్‌సీలో నర్సింగ్ సిబ్బందితోనే చికిత్స అందిస్తున్నారు. ఈ పీహెచ్‌సీలో మూడు నెలలుగా మందులు అందుబాటులో లేవు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ అందుకు తగ్గట్టుగా సేవలు అందించలేకపోతున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని చెబుతున్న వైద్యాధికారులు వారిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జూన్‌లో 148 మంది జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేయగా, జూలైలో 57 మంది టైఫాయిడ్ బాధితులకు వైద్యం అందించారు. తూప్రాన్ ప్రభుత్వ దవాఖానలో సూదుల కొరత తీవ్రంగా ఉంది. దవాఖానకి వచ్చే రోగులకు మందులు అందుబాటులో లేవు. రోగులకు మందులు ఇవ్వాలంటే బయట కొనుగోలు చేసి ఇస్తున్నారు. ఈ పీహెచ్‌సీలో జూన్‌లో 176 మందికి రక్త పరీక్షలు చేయగా, 78 మందికి టైఫాయిడ్ పాజిటీవ్‌గా వచ్చింది. జూలైలో ఇప్పటి వరకు 156 మందికి పరీక్షలు చేయగా, 67 మందికి పాజిటీవ్ అని తేలింది.

### రామాయంపేట దవాఖానకు రోగుల తాకిడి

రామాయంపేట సర్కారు దవాఖానలో సీజనల్ వ్యాధుల కారణంగా రోగుల తాకిడి పెరుగుతోంది. రామాయంపేట మండలంతోపాటు నిజాంపేట్, చిన్న శంకరంపేట మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు దవాఖానకు వస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు 56 మంది మలేరియా బారినపడ్డారు.

### పారిశుధ్య చర్యలు శూన్యం

మెదక్ జిల్లాలో డెంగీ, ఇతర విష జ్వరాల నివారణకు పరిసరాల పరిశుభ్రతే ప్రధాన కారణం. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. బావుల్లో, మురుగు కాలువల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశాలు ఉన్నా ఎక్కడా కనబడడం లేదు. పల్లెల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీనికితోడు సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు మరీ దారుణంగా తయారయ్యాయి.

### డాక్టర్ల కొరతతో ఇబ్బందులు

మెదక్ జిల్లాలోని ఆయా దవాఖానల్లో 46 మంది డాక్టర్ల కొరత ఉన్నది. అయినా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. సర్కారు దవాఖానల్లో చికిత్స అందిస్తాం. రోగులకు మెరుగైన వైద్యం అందించడమే మా లక్ష్యం.

- చంద్రశేఖర్, మెదక్ జిల్లా కేంద్రదవాఖాన సూపరింటెండెంట్

## వంతులవారీగా వైద్యుల విధులు




చేర్యాల దవాఖానలో వైద్యం కోసం క్యూలో ప్రజలు

చేర్యాల, జూలై 15: చేర్యాల ప్రాంత ప్రజలకు సర్కారు వైద్యం సక్రమంగా అందడం లేదు. రోజూ వందల సంఖ్యలో ప్రజలు సర్కారు దవాఖానకు వైద్య సేవల కోసం వస్తున్నారు. కానీ వారికి సేవలు అందించేందుకు సర్కారు నియమించిన వైద్యులు అం దుబాటులో ఉండడం లేదు. వారంలో మూడు రోజులు మాత్రమే స్పెషలిస్టులు ఉంటున్నారు. ఆరుగురు వైద్యులు ఉన్నప్పటికీ రోజువారీగా విధుల్లో మాత్రం ఒక్కరే ఉంటున్నారు. 24 గంటలపాటు వైద్యం అందించాల్సిన వైద్యులు వంతులవారీగా విధులు నిర్వహిస్తున్నా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వాతావరణంలో మార్పులు, సీజనల్ వ్యాధులతో నిత్యం చేర్యాల దవాఖానకు జ్వరం, వాంతులు, విరోచనాలు, నొప్పులతో ప్రజలు వస్తున్నారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు ఔట్ పేషెంట్స్‌కు, ఉదయం నుంచి సాయంత్రం వరకు అత్యవసర సేవలకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా దవాఖాన కొనసాగుతున్నది. పట్టణంతోపాటు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన ప్రజలు వైద్యం కోసం చేర్యాల దవాఖానకు వస్తున్నప్పటికీ వారికి సేవలు సక్రమంగా అందడం లేదు. రోజువారీగా ఒకే వైద్యుడు ఉంటున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# గ్యాస్ట్రిక్,బీపీ గోలీల కొరత



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో జ్వరం, ఇతర వ్యాధులతో చికిత్స పొందుతున్న పేషెంట్లు

సిద్దిపేట, జులై 15: సీజనల్ వ్యాధులు విజృంభించి అనేకమంది చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. పేదలకు వైద్యం అందించే ప్రభుత్వ దవాఖానల్లో సదుపాయాలు, మందుల సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. సిద్దిపేట నియోజకవర్గంలో మెడికల్ కళాశాల దవాఖానతోపాటు, నంగునూరు సీహెచ్‌సీ, నారాయణరావుపేట, పుల్లూరు, ఇబ్రహీంనగర్, రాజగోపాల్‌పేట, చిన్నకోడూర్ పీ హెచ్‌సీలతోపాటు, అంబేద్కర్‌నగర్, నాసర్‌పురా అర్బన్ హెల్త్ కేర్ సెంటర్లు ఉన్నాయి. ఈ దవాఖానలకు ప్రభుత్వ డీఎంహెచ్‌వో స్టోర్, సీఎంఎస్ నుంచి మందులు నేరుగా సరఫరా అవుతాయి. ఈ –ఔషధి ద్వారా ఆయా దవాఖానల్లో అవసరమున్న మందులను ఇండెంట్ తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేస్తారు. కొన్ని పీహెచ్‌సీల్లో బీపీ పేషెంట్లు వాడేటువంటి టెల్మిసెట్రిన్ 40 ఎంజీ గోలీలు నెల రోజుల నుంచి సరఫరా కావడం లేదు. గ్యాస్ట్రిక్ సమస్య ఉన్న వారి కోసం అందించే పాన్‌టాబ్ టాబ్లెట్స్ రెండు నెలలుగా సరఫరా కావడం లేదు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వ్యాధి నిర్ధారణ కోసం ఉపయోగించే టెస్టింగ్ కిట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ జనరల్ దవాఖానతోపాటు, సీహెచ్‌సీలకు మాత్రమే సరఫరా అవుతున్నాయి. ఈ వ్యాధుల నిర్ధారణకు పీహెచ్‌సీల్లో టెస్టింగ్ కిట్లు కూడా అందుబాటులో లేవు.

### మందుల కొరత లేకుండా చూస్తున్నాం..

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ కేర్ సెంటర్లతోపాటు, మెడికల్ కాలేజ్ జనరల్ దవాఖాన, గజ్వేల్ జిల్లా దవాఖానల్లో అన్ని రకాల మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. కొరతగా ఉన్న మందులను ఎప్పటికప్పుడు తెప్పించుకొని, రోగులకు అందుబాటులో ఉంచుతున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, సిద్దిపేట జిల్లా

## మాత్రల కోసం ప్రైవేట్ దవాఖానలకు పరుగులు

- నర్సాపూర్ ఏరియా దవాఖానలో మందుల కొరత
- బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్న రోగులు
- స్టాక్‌లేని రానిటిడిన్, పాంటోప్రోజోల్ మాత్రలు, డైక్లోఫెనాక్ ఇంజక్షన్లు
- అందుబాటులో ఉంచాలంటున్న రోగులు
- మూడు నెలల నుంచి ఇండెంట్ పెడుతున్న దవాఖాన సిబ్బంది



నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖాన

దవాఖానలోని ఫార్మసీ


నర్సాపూర్, జూలై 15: నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో ముఖ్యమైన మాత్రలు, ఇంజక్షన్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు వంద పడకల దవాఖాన అయినప్పటికీ మందుల కోసం మాత్రం ప్రైవేట్ మెడికల్ దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది. నొప్పి, ఎసీడిటీ వంటి ప్రాథమిక వ్యాధులకు కూడా మందులు లేకపోవడంతో సర్కార్ దవాఖాన దీనస్థితికి అద్దం పడుతున్నది. పాంటోప్రోజోల్ మాత్రలను ఎసీడిటీకి విరుగుడుగా వాడుతుంటారు. ఈ మాత్రలు సర్వసాధారణంగా చాలామందికి ఎక్కువగా అవసరం ఉంటాయి. కానీ నర్సాపూర్ సర్కార్ దవాఖానలో ఈ మాత్రలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ప్రతిఒక్కరికీ తరచూ గాయాలు కావడం, కీళ్లు, కండరాల నొప్పులు, వాపు, ఇతర నొప్పులకు ప్రభుత్వ దవాఖానకు నిత్యం వస్తుంటారు. కానీ వీటిని నివారించే డైక్లోఫెనాక్ ఇంజక్షన్లు దవాఖానలో లేకపోవడంతో రోగులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఎసీడిటీని తగ్గించడానికి, అజీర్ణం, గుండెల్లో మంట తదితర వాటికి రానిటిడైన్ మాత్రను వాడుతారు. ఈ మాత్రలు కూడా ఎసీడిటీలో స్టాక్ లేకపోవడం గమనార్హం. సర్కార్ ఎసిడిటీలో రోగులకు వైద్యులు ప్రిస్కిప్షన్ రాస్తే అందులో నాలుగు గోలీలు ఉంటే, రెండు గోలీలు మాత్రమే ఫార్మసీలో లభిస్తున్నాయి. మిగతా మాత్రల కోసం రోగులు ప్రైవేట్ మెడికల్ దుకాణాలకు పరుగులు తీయాల్సి వస్తుంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ మందులు నిల్వ ఉండకపోవడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సర్కార్ ఎసిడిటీలో అన్ని రకాల మందులు నిల్వ ఉంచాలని రోగులు కోరుతున్నారు.

### ప్రభుత్వం నుంచి సరఫరా లేదు

కొన్ని మాత్రలు ప్రభుత్వం నుంచి సరఫరా కావడం లేదు. అవసరాన్ని బట్టి రోగులకు ఇబ్బంది లేకుండా బయట కొనుగోలు చేస్తున్నాం. మూడు నెలల నుంచి ఇండెంట్ పెడితే నాట్‌అవెలబుల్ అంటున్నారు. రాన్‌టాక్, పాంటాప్రోజోల్ అందుబాటులో లేవు. ప్రభుత్వం సప్లయ్ చేయడం లేదు. నిన్న ఆదివారం ఉండడంతో బయటి నుంచి తెప్పించలేకపోయాం. కొనుగోలు చేసి రోగులకు అందుబాటులో ఉం చుతాం. ఈ మాత్రలను సంగారెడ్డి నుంచి కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లిస్తున్నాం. అప్పుడప్పుడు డీఎంహెచ్‌వో నుంచి మందులు తీసుకొస్తున్నాం. రోగులకు ఇబ్బందులు కలుగకుండా మెడిసిన్లు అందుబాటులో ఉంచుతాం.

-డా. పావని, సూపరింటెండెంట్, నర్సాపూర్ ప్రభుత్వ దవాఖాన

### కడుపులో మంటకు మందులు లేవట..




కడుపులో మంటగా ఉంటే సర్కారు దవాఖానకు వచ్చిన. డాక్టర్‌కు చూపించుకుంటే మం దుల చిట్టి రాసిండు. అది తీసుకొని మందులిచ్చే దగ్గరకు వస్తే మందులు లేవంటున్నారు. బయట కొనడానికి పైసల్ లేకనే కదా సర్కార్ దవాఖానకు వొస్తి ని...వీళ్లేమో లేవంటున్నారు. పైసలు పెట్టి కొని బయట కొనాల్సి వస్తుంది.

- సత్తయ్య, పేషంట్, నారాయణపూర్

## ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

- నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి రైతులతో సమావేశం



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డిపల్లి రైతులు

మెదక్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రెడ్డిపల్లి త్రిపులార్ పరిహారం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెడ్డిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి రైతులు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ భూమి త్రిపుల్ ఆర్‌లో పోతుందని, దాని వల్ల ప్రజలకు తీవ్రనష్టం కలుగుతుందని, త్రిపుల్‌ఆర్ అలైన్మెంట్ మార్చాలని, పరిహారం పెంచాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెడ్డిపల్లి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అలైన్మెంట్ మార్చడం వీలుకాదని, అయినప్పటికీ ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకెళ్తానని, పరిహారం పెంపు విషయంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. రైతులందరూ సమన్వయంతో ఉండాలన్నారు. పరిహారం పెంపు విషయంలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్, సత్యనారాయణ గౌడ్, మహేశ్ గౌడ్, సత్యనారాయణ, నిరంజన్, నగేశ్‌గౌడ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా గుట్కా తరలిస్తే చర్యలు

### సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

మునిపల్లి, జూలై 15: అక్రమంగా నిషేధిత గుట్కా, పాన్ మసాలాలు తరలిస్తే చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. సోమవారం మండలపరిధిలోని బుధేరా పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నిషేధిత వస్తువులను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు బృందాలుగా ఏర్పడి పక్క రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి నిషేధిత గుట్కా, పాన్ మసాలాలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటారని చెప్పారు. కంకోల్ శివారులోని ముంబయి జాతీయ రహదారిపై డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద రాష్ట్రానికి భారీగా గుట్కా, పాన్ మసాలాలు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. వాహనంలో నిషేధిత గుట్కా, తంబాకును పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బీదర్‌లోని అర్ఫత్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ యజమాని అర్ఫత్ ఆదేశానుసారం హైదరాబాద్‌లోని కాటేదాన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గుట్కా తరలిస్తున్న షేక్ షబ్బీర్, అర్ఫత్, తవ్‌సిఫ్‌లను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. సంగారెడ్డి డీఎస్పీ సతయ్య గౌడ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, సీసీఎస్ సీఐ మల్లయ్య, సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, మునిపల్లి ఎస్సై రాజేష్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.



బుధేరాలో విలేకరులతో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్